క్లుప్తంగా

పేకాట స్థావరంపై దాడి

మిరుదొడ్డి(దుబ్బాక): పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని తొగుట మండలం గుడికందుల గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న అందిన సమాచారం మేరకు మిరుదొడ్డి పోలీసులతో పాటు, సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. దాడి ఘటనలో ఇద్దరు పారిపోగా తొమ్మిది మంది పేకాట రాయుళ్ళను అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి రూ. 5715 నగదు, 5 మొబైల్ ఫోన్లు, ఒక ఆటో, ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిరుదొడ్డి ఎస్ఐ బోయిని పరశురాములు శనివారం తెలిపారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

పరామర్శించిన ఎంపీ రఘునందన్‌రావు



పరామర్శిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: దుబ్బాక పట్టణానికి చెందిన బీజేపీ 42వ బూత్ అధ్యక్షుడు దొమ్మట బాలరాజు గుండెపోటుతో మృతి చెందాడు. బాలరాజుకు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కొడుకు రెండేళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో బాలరాజు అంత్యక్రియలు పెద్ద కూతురు శ్రావణి శనివారం నిర్వహించింది. తండ్రి చితికి తలకొరివి పెడుతున్న కూతుర్ని చూసి అక్కడున్నవారు కన్నీరుమున్నిరయ్యారు. విషయం తెలుసుకున్న ఎంపీ రఘునందన్‌రావు ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని హమినిచ్చారు.

రాజీమార్గం.. రాజమార్గం

అదనపు డీసీపీ మల్లారెడ్డి



మాట్లాడుతున్న మల్లారెడ్డి

సిద్దిపేటకమాన్: జాతీయ లోక్‌అదాల్‌తో రాజీపడే కేసులలో రాజీపడేట్లు కక్షిదారులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని అదనపు డీసీపీ మల్లారెడ్డి పిలుపునిచ్చారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో కోర్టు విధులు నిర్వహించే సిబ్బందితో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14న జాతీయ లోక్ అదాల్ నిర్వహించనున్నారని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


రూ.1.23లక్షల ఆర్థిక సహాయం



బాండ్‌లు అందజేస్తున్న స్నేహితులు

బెజ్జంకి(సిద్దిపేట): మృతిచెందిన తమ మిత్రుడి కుటుంబానికి స్నేహితులు ఆపన్నహస్తం అందించారు. మండల కేంద్రానికి చెందిన ఐలేని మహేందర్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. 1997-98లో ఆయనతో పదో తరగతి చదివిన స్నేహితులు శనివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కూతుర్ల పేరున డిపాజిట్ చేసిన రూ.1.23 లక్షల విలువైన బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో బండి రమేశ్, బండిపెల్లి సత్యం, అబ్దుల్ అజీజ్, బొనగం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్యాబోధన



మట్లాడుతున్న షబానా

దుబ్బాకటౌన్: సరైన పోషణ, ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయని సూపర్‌వైజర్ షబానా అన్నారు. రాయపోల్ మండలం రాంసాగర్ అంగన్వాడీ కేంద్రంలో శనివారం ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు పౌష్టికాహారంతో కూడిన భోజనం అందిస్తూ ఆటపాటలతో విద్యాబోధన చేస్తున్నామన్నారు. అంగన్వాడీ టీచర్లు రామలక్ష్మి, సవిత, కల్పన, రమణ తదితరులు పాల్గొన్నారు.

అప్‌గ్రేడ్ చేసినా.. పాత వేతనమే..

- జీతం, ఇతర సమస్యలతో అంగన్వాడీల వెతలు
- పెరిగిన జీతాలు అందేదెప్పుడో?
- ఎనిమిది నెలలుగా అద్దె బకాయిలు
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం పడిగాపులు

చేర్యాల(సిద్దిపేట): మినీ అంగన్వాడీ టీచర్ల పని ఒత్తిడి అంతా ఇంతా కాదు. అంగన్వాడీనా... అంటూ చాలా చులకనగా చూస్తారు అందరూ. కానీ.. వాళ్ల పని చాలా కీలకం. కేంద్రాల్లో వంటపని చేస్తారు. పిల్లల బాగోగులు చూస్తారు. విద్యాబుద్ధులు నేర్పిస్తారు. అంతే కాదు సమావేశాలకు హాజరై, వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుచేస్తూ రికార్డులు నిర్వహిస్తారు. ఇలా అనేక పనులతో టీచర్లు ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. దానికి తోడు మినీ అంగన్వాడీల్లో హెల్పర్లు లేకపోవడంతో పనులన్నీ టీచర్లు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంత చేస్తున్నా పెరిగిన వేతనాలు రాక, అద్దె బిల్లులు విడుదల కాకపోవడంతో సొంతంగా భరిస్తున్నారు. దీంతో తీవ్రమైన మానసిక క్షోభ అనుభవిస్తున్నారు.

అప్‌గ్రేడ్ టీచర్ల ఇబ్బందులు..

రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్వాడీలను మెయిన్ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసింది. టీచర్లను సైతం అప్‌గ్రేడ్ చేసి నెలకు రూ.7.800 నుంచి రూ.13,650కి పెంచింది. పెరిగిన వేతనం రెండు నెలలు ఇచ్చిన ప్రభుత్వం ఏప్రిల్ నుండి పాత జీతం రూ.7,800 మాత్రమే ఇస్తోంది. దీనికి తోడు భవనాల అద్దె రాకపోవడంతో సొంత డబ్బులు చెల్లిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు.

ఉద్యోగ విరమణ పొందిన వారి కష్టాలు

ప్రభుత్వం 65యేండ్లు నిండిన అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు పదవి విరమణ ప్రకటించింది. టీచర్లకు రూ.లక్ష, హెల్పర్‌కు రూ.50వేల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లిస్తామని చెప్పింది. కానీ ఇప్పటి వరకు ఏ ఒక్కరికి చెల్లించిన దాఖలాలు లేవు. సుమారు రెండు, మూడు దశాబ్దాల నుండి పనిచేస్తున్న వారందరినీ వయస్సు పదవి విరమణ పేరుతో తొలగించి, వారికి ఎలాంటి బెనిఫిట్స్ ఇవ్వకపోవడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.



అంగన్వాడీ కేంద్రంలో చదువుకుంటున్న పిల్లలు

ఎనిమిది నెలలుగా అందని అద్దె..

జిల్లాలో 66 మినీ అంగన్వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేశారు. దీంతో మొత్తం అంగన్వాడీ కేంద్రాల సంఖ్య 1150కి చేరింది. వాటిలో 458 కేంద్రాలకు సొంత భవనాలుండగా మరో 299 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగిలిన 393 కేంద్రాలు ఉచిత భవనాల్లోనే కొనసాగుతున్నాయి. మార్చి నుండి అద్దె రాకపోవడంతో భవన యజమానుల ఒత్తిడి వల్ల టీచర్లే వాటిని చెల్లిస్తున్నారు.

పెరిగిన వేతనం చెల్లించాలి



మినీ అంగన్వాడీ టీచర్లను అప్‌గ్రేడ్ చేసి రెండు నెలలు పెరిగిన జీతం ఇచ్చిన ప్రభుత్వం మళ్లీ పాత లెక్కనే ఇస్తోంది. ఎనిమిది నెలలుగా పెరిగిన వేతనం అందడంలేదు. 65 యేండ్లు నిండిన టీచర్లు, హెల్పర్లను పదవివిరమణ చేయమని చెప్పిన ప్రభుత్వం వారికిస్తానన్న రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.లక్ష, రూ.50వేలు ఇప్పటి వరకు ఇవ్వలేదు. ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యలు పరిష్కరించాలి.

– మదుమదుకల పద్మ, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి

ప్రభుత్వ దృష్టిలో ఉంది



అద్దె భవనాలకు త్వరలోనే బకాయిలు మంజూరు అవుతాయి. అప్‌గ్రేడ్ అయినా టీచర్ల వేతనాల పెంపు విషయం ప్రభుత్వ పరిధిలో ఉంది. ఇది అమలు కావాల్సి ఉంది. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ప్రక్రియ పూర్తి కాగానే ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తాం.

– చింతపల్లి శారద, ఇన్‌చార్జి జిల్లా సంక్షేమ అధికారి, సిద్దిపేట

రైతన్న ఆలోచన అదుర్స్..

- తరచూ అడవి పందులు, కోతుల దాడులు
- పంట రక్షణ కోసం రైతుల ప్రయత్నాలు
- రూ.12వేలు వెచ్చించి మక్క చేను చుట్టూ వల



మక్క చేను చుట్టూ ఏర్పాటు చేసిన వల

అక్కన్నపేట(హుస్నాబాద్): రైతు వ్యవసాయం చేయాలంటే ఎన్నో కష్ట, నష్టాలను ఎదుర్కోవాలి. పొలంలో విత్తు విత్తింది మొదలు పంట దిగుబడి చేతికొచ్చే వరకూ రేయింబవళ్లు కంటికి రెప్పలా సంరక్షించాలి. వేలకు, వేలకు పోసి రైతు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ఓవైపు అతివృష్టి, అనావృష్టి, చీడ పీడలు పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంటే.. మరోవైపు అడవిపందులు, కోతుల బెడదతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. అక్కన్నపేట మండలం చౌటకుంట, సేవాలాల్ మహారాజ్‌తండా, బంగారులొద్ది తండాలు గుట్టల సమీపంలో ఉంటాయి. దీంతో రైతులు ప్రతియేటా మొక్కజొన్న, వరి, పొద్దుతిరుగుడు పంటలను సాగు చేస్తుంటారు. చేతికొచ్చే సమయంలో అడవిపందులు, కోతులు దాడులు చేస్తూ పంటలను నష్టపరుస్తుంటాయి. ఈ క్రమంలో వాటి నుంచి పంటను కాపాడుకోడానికి కొందరు రైతులు వినూత్నంగా ఆలోచన చేస్తున్నారు. అందులో చౌటకుంట తండా పరిధిలోని సీతారాంతండాకు చెందిన మాలోతు వీరన్న తనకున్న రెండు ఎకరాల మక్కచేను చుట్టూ వలను ఏర్పాటు చేశాడు. దానికి 10వేల నుంచి రూ.12వేల వరకు ఖర్చు చేశాడు. దీంతో అడవి పందులు, కోతులు రావట్లేదని చెబుతున్నాడు.

పౌష్టికాహారంతోనే గర్భిణుల ఆరోగ్యం

- సీడీపీఓ సరిత



మాట్లాడుతున్న సీడీపీఓ సరిత

ములుగు(గజ్వేల్)/చిన్నకోడూరు(సిద్దిపేట): గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని గజ్వేల్ సీడీపీఓ సరిత సూచించారు. ములుగు మండలంలోని కొక్కొండ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమతుల్యంతో కూడిన ఆహారం తీసుకుంటే గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజిత, నిర్వాహకులు నాగరాణి, శైలజ, నర్మద, పద్మ, అరుణలత తదితరులు పాల్గొన్నారు. చిన్నకోడూరు మండల పరిధిలోని గంగాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో 'సరైన పోషణ ఆరోగ్య తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. పౌష్టికాహారం, పిల్లల వ్యక్తిగత శుభ్రత గురించి పోషకులకు అవగాహన కల్పించారు. వైద్యురాలు స్నేహ, అంగన్‌వాడీ టీచర్ శారద మాట్లాడుతూ పిల్లలకు అందించే పౌష్టికాహారం గురించి వివరించారు.

కల్యాణం.. కమనీయం

- వైభవంగా సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవం



కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు

వర్గల్(గజ్వేల్): శ్రీవిద్యాసరస్వతి క్షేత్రం కల్యాణ శోభతో అలరారింది. శనివారం శ్రీసుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవ వేళ శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 11గంటలకు స్వామి వారి కల్యాణ వేడుక ప్రారంభమైంది. అధిక సంఖ్యలో భక్తులు వేడుక తిలకించి పరవశించారు.

అయ్యప్పఆలయంలో..

చేర్యాల(సిద్దిపేట): స్థానిక అయ్యప్పఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం కనుల పండుగగా నిర్వహించారు. అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ భక్తులు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' లబ్ధిదారుల ఎంపిక షురూ

- పారదర్శకంగా వివరాలు సేకరించాలి
- 15లోపు సర్వే పూర్తి చేయాలి
- మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్



ప్రొజెక్టర్ ద్వారా వివరిస్తున్న ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో భాగమైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో అధికారులు, సిబ్బంది పారదర్శకంగా సమగ్ర వివరాలను సేకరించాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారులు, మెప్మా సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన సర్వే ప్రక్రియను ప్రొజెక్టర్ ద్వారా ఆయన వివరించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా 9నుంచి సర్వే ప్రారంభించి 15రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. సందేహాలు, అనుమానాలు ఉంటే తనతో మాట్లాడాలని సూచించారు. అంతకు ముందు పారిశుద్ధ్య వాహనాల డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. చెత్తను మున్సిపల్ వాహనానికి ఇవ్వని వారి వివరాలను నమోదు చేసుకుని, వారికి అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీశ్, వనిత, మాధవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోత.. కార్మికులు విధుల బహిష్కరణ



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

గజ్వేల్‌రూరల్: పారిశుద్ధ్య పనులు చేపడుతున్న కార్మికుల వేతనాల్లో కోత విధించడాన్ని నిరసిస్తూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్మికులు, సిబ్బంది ధర్నాకు దిగారు. శనివారం తమ విధులను బహిష్కరించి పాత మున్సిపల్ కార్యాలయం నుండి కొత్త మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ కార్మికులు విధులకు సరిగ్గా రావడం లేదనే పేరుతో కోత విధించిన వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. కార్మికులకు వారాంతపు సెలవులతో పాటు జాతీయ పండుగలు, క్యాజువల్ సెలవులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్‌తో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చైర్మన్ రాజమౌళి హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నాను విరమించారు. కార్యక్రమంలో యాదగిరి, కుమార్, స్వామి, నర్సింహులు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

యేడాదిలోనే మార్పు మొదలైంది..

- రూ.29.50కోట్లతో బీటీరోడ్లు
- రూ.4కోట్లతో సీసీ రోడ్లు
- కాంగ్రెస్ నేతలు



మాట్లాడుతున్న ప్రవీణ్

అక్కన్నపేట(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని, తొలి యేడాదిలోనే స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేశారని కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి పెద్ది ప్రవీణ్, మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య అన్నారు. అక్కన్నపేటలో శనివారం ప్రజాపాలన విజయోత్సవం సందర్భంగా మర్రిచెట్టు నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని అన్ని గిరిజనతండాలకు తారురోడ్ల నిర్మాణానికి సుమారు 29.50కోట్లు కేటాయించారన్నారు. అదేవిధంగా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.4కోట్లు, 8 ఓపెన్ జిమ్‌లకు రూ.40లక్షలు మంజూరు చేశారని చెప్పారు. 100కు పైగా కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశామని, అలాగే చౌటపల్లి క్రాసింగ్ వద్ద ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణం జరగబోతుందని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ ఐల్లయ్య, సంజీవ్‌రెడ్డి, మల్లారెడ్డి, సుజాత, రమేశ్, భాస్కర్, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి ఐదు రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 17మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.19,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీకి..

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని పోతారం శివారులోగల రాజీవ్ రహదారిపై శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఓ ఇసుకలారీని పట్టుకుని జరిమానా విధించినట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. ఇసుకను అక్రమంగా రవాణా చేసినా, ఓవర్‌లోడ్‌తో వెళ్తున్నా కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

మట్టి టిప్పర్ స్వాధీనం

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని బస్వాపూర్ శివారులోని ప్రభుత్వ భూమిలో మట్టిని అక్రమంగా తరలిస్తున్న ఓ టిప్పర్‌ను పోలీసులు, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. స్థానికులు సమాచారం మేరకు శనివారం ఉదయం అనుమతులు లేకుండా రోడ్డు పనుల కోసం మట్టిని తరలిస్తుండగా టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కార్యకర్త కుటుంబాన్ని ఆదుకుంటా..: ఎమ్మెల్యే పల్లా



బాలుడిని ఓదారుస్తున్న పల్లా

కొమురవెల్లి(సిద్దిపేట): చిన్న వయస్సులోనే తండ్రిని కోల్పోయిన బాలుడి పరిస్థితిని చూసి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. తపాస్‌పల్లిలోని బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీకాంత్ అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం అతని కుటుంబాన్ని పరామర్శించి అంత్యకియలలో పాల్గొన్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

డివిజన్ ప్రకటించకపోవడం దారుణం

- సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

దుబ్బాకటౌన్: దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కొన్ని సంవత్సరాలుగా ప్రజలు, ప్రజాప్రతినిధులు పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించకపోవడం దారుణమని సీపీఎం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. శనివారం దుబ్బాకలో ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక అభివృద్ధి చెందాలన్నా.. ప్రజలకు సౌకర్యాలు మెరుగు పడాలన్నా డివిజన్ చాలా అవసరమన్నారు. రెండు లక్షలకుపైగా జనాభా ఉన్నారని శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఎంపీ రఘునందన్‌రావు డివిజన్ ఏర్పాటుకు కట్టుబడి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోపాలస్వామి, జి.భాస్కర్, నవీన, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోండి

సిద్దిపేటజోన్: ఎమ్మెల్యే పదవిలో ఉండి ఒక సామాజిక వర్గాన్ని దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌పై చర్యలు తీసుకోవాలని సిద్దిపేట పద్మనాయక వెలమ సంక్షేమ సమితి అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. ఇటీవల వెలమ సామాజిక వర్గంపై ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను ఖండించారు. శనివారం సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం పద్మనాయక వెలమ ఫంక్షన్ హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. వెలమ సామాజికవర్గం అంతు చూస్తానని బెదిరించడం సరికాదన్నారు. సమావేశంలో నేతలు సంపత్‌రావు, సంతోష్‌రావు, కమలాకర్‌రావు, గోపాల్‌రావు, కిషన్‌రావు, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ' లేక గర్భిణుల ఇబ్బందులు

- కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వినతి

గజ్వేల్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రం అందుబాటులో లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని 16, 17 వార్డుల పరిధిలోని ప్రజలు వాపోయారు. ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం యువజన సంఘాల నాయకులు కేతోజీ వినోద్ ఆధ్వర్యంలో ఆయా కాలనీల ప్రజలు సంబంధిత అధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వినోద్ మాట్లాడుతూ 16, 17 వార్డుల పరిధిలోని శివాలయం వీధి, ఆఫీసర్స్ కాలనీ, లక్ష్మీప్రసన్న కాలనీలకు చెందిన ప్రజలకు అంగన్‌వాడీ కేంద్రం అందుబాటులో లేదన్నారు. గర్భిణులు, బాలింతలు ఇతర కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేయించుకొంటే తమ పరిధిలోకి రాదంటూ నిర్వాహకులు వెళ్లగొడుతున్నారని, అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా కాలనీల వాసులు లక్ష్మి భావన, నవ్య, హన్మంతు, ప్రశాంత్, నవీన్, శివ, ప్రభుదాస్, మల్లేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రక్తదానంతో ప్రాణదానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రక్తదానం చేయడం అంటే తోటి మనిషి ప్రాణాలు కాపాడడమేనని సైనికుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక లయన్స్‌క్లబ్ భవన్‌లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దు భద్రత కోసం అమరులైన జవాన్‌ల కుటుంబాలకు అండగా ఉండేందుకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రతియేటా డిసెంబర్ 7న సాయుధ దళాల పతాక దినోత్సవం జరుపుకుంటామన్నారు. అనంతరం లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ రమేశ్ మాట్లాడారు. క్లబ్ సభ్యులు శేఖర్, నిర్మల, జోజి, మాజీ సైనికులు చంద్ర, స్కైలాబ్‌రెడ్డి, మల్లికార్జున్, వెంకటరమణారెడ్డి, నరేష్, డాక్టర్ శ్రావణి పాల్గొన్నారు.

◆ ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయలేం..

జగదేవ్‌పూర్(గజ్వేల్): గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయలేమని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ యాదగిరికి శనివారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రోజువారి పనులతో పాటు సర్వేతో పనిభారం ఎక్కువవుతోందన్నారు. రెవెన్యూ, గృహనిర్మాణశాఖలకు చెందిందని, ఆ అధికారులచేత సర్వే నిర్వహించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు, ఈజీఎస్ తదితర పనులకు ఆటంకం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

◆ వెటర్నరీ కళాశాల సందర్శన

చిన్నకోడూరు(సిద్దిపేట): చంద్లాపూర్ శివారులోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలను శనివారం తెలంగాణ పశువైద్య విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డా.శరత్ చంద్ర ఆకస్మికంగా సందర్శించారు. బాలుర, బాలికల వసతి గృహాలు పరిశీలించి వసతులపై ఆరా తీశారు. కోర్సు ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. పరశురాములు, అధ్యాపకులు పాల్గొన్నారు.

◆ క్రీడాకారులకు దుస్తులు అందజేత

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొనేందుకు వెళ్తున్న మహిళా కబడ్డీ జట్టుకు శనివారం కాంగ్రెస్ నాయకులు కన్నాయాదవ్, టీపీటీఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేష్ సహకారంతో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌సీ సంతోష్ శనివారం దుస్తులు అందజేశారు. శివకుమార్, మహేశ్, సంపత్, ప్రభాకర్, సంపత్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

◆ దీనమైన పరిస్థితుల్లో చేనేత కుటుంబాలు

దుబ్బాక: చేనేత కార్మికుల కుటుంబాలు దీనమైన పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్ అన్నారు. చేనేతల స్థితిగతులపై రాష్ట్ర వ్యాప్తంగా అధ్యయనం చేస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతలను ఆదుకోవడంలో విఫలం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

◆ నెలలు గడుస్తున్నా అందని వేతనాలు

గజ్వేల్‌రూరల్: నెలలు గడుస్తున్నా ఉపాధి హామీ కూలీలకు వేతనాలు అందడం లేదని డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పిడిచెడ్ గ్రామంలో ఉపాధి పనులు చేపడుతున్న కూలీల సమస్యలను శనివారం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలీలు పనులు చేపట్టి ఐదు నెలలు గడిచినా వారికి కూలీ డబ్బులు రాలేదని, దీంతో పనులకు వెళ్లేందుకు విముఖత చూపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

◆ ఆరు గ్యారంటీలతో వెలుగులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందని అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వహాబ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అజ్మత్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా ప్రయోజనాల కోసం తమ ప్రభుత్వం ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. రాషద్, ప్రవీణ్, పవన్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ ఎక్కువ పన్ను కట్టాల్సి వస్తోంది..

సిద్దిపేటకమాన్: పోలీసులకు ఇచ్చే అలవెన్స్‌లు వారి వేతనంతో కలిపి ఇవ్వడంతో ఎక్కువ ఆదాయపు పన్ను కట్టాల్సి వస్తోందని తెలంగాణ పోలీసు ఫోరం అధ్యక్షుడు శ్రీశైలం అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధిక టాక్స్ చెల్లించడం ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోందని వాపోయారు. అలవెన్స్‌లను వేరుగా చెల్లించాలని కోరారు.

◆ దివ్యాంగులపై ఆప్యాయత అవసరం

కొండపాక(గజ్వేల్): దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండపాక హైస్కూల్లో శనివారం క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులు సైతం వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఐఈ కో-ఆర్డినేటర్ రంగనాథ్, హెచ్‌ఎం విఠల్‌నాయక్, ఫిజికల్ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.